క్లుప్తంగా

పంటల పరిశీలన



పల్లెకోన(భట్టిప్రోలు): అకాల వర్షాలకు నేలవాలిన మొక్కజొన్న పంటలను సోమవారం మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య పరిశీలించారు. పల్లెకోన, కోనేటిపురం, సూరేపల్లి, భట్టిప్రోలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. నష్టం అంచనా వేశారు. పొలాల్లో గాడులు తీసి, నీరు బయటకు పంపే విధంగా చూడాలని రైతులకు సూచించారు. యూరియా ఎకరాకు 25 కిలోలు, పొటాష్ 5 కిలోలు చల్లుకోవాలని సూచించారు. తరువాత ఫార్ములా 4, కార్బండైజం 300 గ్రాములు చొప్పున పిచికారి చేయాలని చెప్పారు.

ఎంఏపీ యువజన విభాగం గౌరవాధ్యక్షుడిగా హుస్సేన్



అమృతలూరు(భట్టిప్రోలు): ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంవీఏ) బాపట్ల జిల్లా యువజన విభాగం గౌరవాధ్యక్షుడిగా వేమూరు నియోజకవర్గం అమృతలూరుకు చెందిన షేక్ ఇమామ్ హుస్సేన్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం చీరాలలో జరిగిన అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో హుస్సేన్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీరాబాబు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్, బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు షేక్ ఇలియాజ్ ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం పాటుపడతానని తెలిపారు.

వెల్లటూరులో ఏపీ ఎస్ఎస్ఎస్ శిక్షణ సదస్సు



వెల్లటూరు(భట్టిప్రోలు): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా సంస్థ (ఏపీ ఎస్ఎస్ఎస్) జన నిర్మాణ మండల లీడర్ల శిక్షణ సదస్సు సోమవారం వెల్లటూరులో గుంటూరు మేత్రాసన డైరెక్టర్, విచారణ గురువు గోవిందరాయన్న ఆధ్వర్యంలో జరిగింది. భట్టిప్రోలు ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రవి కుమార్‌రెడ్డి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎ. ప్రకాష్‌రెడ్డి లీడర్లను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో చిన్నారుల పరిరక్షణ, కౌమార బాలికల ఆరోగ్యం, వాతావరణంలో మార్పులు, దళిత సంఘాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. సదస్సులో డైరెక్టర్, విచారణ గురువు టీపీ ప్రసాద్, లోకల్ కో–ఆర్డినేటర్ పచ్చిగళ్ల వెంకట్రావు, సత్తెనపల్లి కో–ఆర్డినేటర్ బి.టూర్థా, 20 గ్రామాల నుంచి మహిళా లీడర్లు పాల్గొన్నారు.

పిల్లలవారిపాలెంలో జ్వరాల సర్వే



నిజాంపట్నం: ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ మురళీ సూచించారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పిల్లలవారిపాలెంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే చేపట్టారు. పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి.. ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. అనుమానితులకు ఆర్డీటీ టెస్ట్ చేసి మందులు అందించడం జరుగుతుందన్నారు. దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



వేమూరు: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని పంచాయతీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బి.అగస్టీన్ డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టి.. తహసీల్దారు బ్రాహ్మణ్ కుమార్‌కు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీతకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు పి.సురేష్, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, నాయకులు పి.రమేష్, పి.రవి, రాంబాబు, సామ్రాజ్యం, సుశీల పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు రూ.8.11 కోట్లు

భట్టిప్రోలు: మండలంలోని 1,008 స్వయం సహాయక సంఘాలకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.8.11 కోట్లు జమ కానున్నట్లు మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కొండూరు శోభన్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నగదును ఈ నెల 25న విడుదల చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల చెంతకే

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల చెంతకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేనని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం స్థానిక పటేల్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలను అందించటంతోపాటు.. వారి సమస్యలను కూడా సచివాలయాల ద్వారా పరిష్కారించడం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కారిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజకంగా ఉందన్నారు. బాపట్ల ప్రాంతాన్నీ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాపట్ల ప్రాంతంలో జగనన్న కాలనీల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు కాగిత సుధీర్‌బాబు, చేజర్ల నారాయణరెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, ఆట్ల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల్లో 'స్పందన' కరువు



స్పందనకు హాజరైన నలుగురు అధికారులు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం తూతూ మంత్రంగా జరిగింది. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అన్ని శాఖల అధికారులు తహసీల్దారు కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉంది. అ యితే నలుగురు అధికారులు మాత్రమే హాజ రయ్యారు. కొంతకాలంగా జరుగుతున్న స్పందన కార్యక్రమం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నా రు. ఉన్నతాధికారులు ఒకసారి మండలం వైపు దృష్టిసారించాలని కోరుతున్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పట్టాదారు పాసుపుస్తకాలకు- 2, జనన ధృవీకరణ పత్రానికి -1, నల్లూరు పాలెంలో జరిగిన చోరీ కేసుపై పోలీసులు దర్యాప్తు చేయటంలేదని- 1, ఓల్డ్‌టౌన్ రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాన్ని కోల్పోయిన తమకు బాండ్ ఇచ్చారు గాని వాల్యూ పేపర్‌ను ఇవ్వలేదని-1 అర్జీలు అందాయన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విలువలు కలిగిన విద్యతో గమ్యాలు చేరుకోవాలి

బౌడా ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు



విద్యార్థులను అభినందిస్తున్న దేవినేని మల్లికార్జునరావు

రేపల్లె: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించిననాడే తమ గమ్యాన్ని చేరుకోగలరని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని రామకృష్ణ విద్యానిలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన 20వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. లక్ష్యాలను చేరుకునేందుకు శ్రమ, దీక్ష, పట్టుదలను ఆయుధాలుగా మలుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్, కరస్పాండెంట్ కుర్రా అవర్ణ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఎగ్జిబిషన్‌లో 'బాపట్ల'కు ద్వితీయం



ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

బాపట్ల అర్బన్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు అకడమిక్ ఎగ్జిబిషన్-2023 జరిగింది. ఇందులో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు ద్వితీయ బహుమతి లభించింది. యూనివర్సిటీ పరిధిలోని వివిధ కాలేజీల విద్యార్థులు 860 నమూనాలను ప్రదర్శించారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాస్‌రావు తెలిపారు. ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్కే నజీర్ మాట్లాడారు. ఈసీఈ, సివిల్, ఈఈఈ విభాగాలకు చెందిన తొమ్మిది నమూనాలు న్యాయనిర్ణేతలు, అతిథులు, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డి.రామ్మోహన్‌రావు, జి.దిలీప్, జాయింట్ సెక్రెటరీ కె.హరి పద్మప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణ, విభాగాధిపతులు ఆచార్య డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ నాగ సతీష్, ఆచార్య డాక్టర్ జి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది బ్లాక్ డే..



అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకుల నిరసన..

వేమూరు: శాసన సభలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తలతోటి సుధాకర్‌బాబుపై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు అశోక్, బాల వీరాంజనేయస్వామి దాడి చేయడంపై.. స్థానిక వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, బ్లాక్ డేగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌పైకి పేపర్ల విసరడం చాల దారుణమన్నారు. వారిని అడ్డుకున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి చేయడంతో గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలు నేటికీ ఎస్సీ, ఎస్టీలు అంటే చాల చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తలతోటి సువర్ణరాజు, గుమ్మడి దానియేలు, దొప్పలపూడి జ్యోతిబాబు, వేమూరి మోషే, గొడుకు ప్రకాష్, తలతోటి ప్రదీప్, దర్శి శ్రీకాంత్ అమర్తలూరు వెంకయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చేపట్టాలి

భట్టిప్రోలు: అధిక వర్షాల నేపథ్యంలో మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకుడు సయ్యద్ అక్తర్ హుస్సేన్ సోమవారం వివరించారు. రైతులు పంట పొలాల్లో కాల్వలు తీసి అధిక నీటిని బయటకు పంపాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న పెరుగుదల దశలో ఉంటే ఎకరాకు ఒక బస్తా యూరియా, అర బస్తా పొటాష్ చల్లుకోవాలన్నారు. అలాగే కోత దశలో ఉంటే గింజకు బూజు తెగులు రాకుండా ఎకరాకు 250 ఎంఎల్ ప్రోఫికొనజోల్ (టిల్ట్) లేదా 500 ఎంఎల్ హెక్సాకానోజోల్ (కాంటాఫ్) పిచికారి చేసుకోవాలని సూచించారు.

రేపు బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవం

తెనాలి: బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ వెల్లడించారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ గాయని, చెన్నై ఫోర్డ్ కంపెనీ డిజైనర్ ఇంజినీర్ శృతి చింతలపాటి, నాద నీరాజనం ఫేమ్ డాక్టర్ మంజుల అన్నమయ్య సంకీర్తనా లహరితో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆహ్వాన పత్రికను పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాల్ని పురుషోత్తమశర్మ వివరించారు. ప్రముఖ కవి, పండితుడు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీమాన్ దీవి నరసింహదీక్షిత్ రచన 'శ్రీవేంకటాచల మహాత్మ్యం' గ్రంథావిష్కరణ, అనంతరం ఆయన శోభకృత్ ఉగాది పంచాంగ శ్రవణం ఉంటాయని తెలిపారు. పరిషత్ వార్షిక ఉగాది పురస్కారాన్ని ఈసారి ఏలూరుకు చెందిన డాక్టర్ మైలవరపు బి.ఎస్.శర్మకు బహూకరించనున్నట్టు చెప్పారు. గుంటూరు జిల్లా వేద పరిషత్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్, వీజీఎస్ పబ్లిషర్స్ ఎస్.రామారావు, ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి హాజరుకానున్నట్టు వివరించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

చెరుకుపల్లి: ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఆరేపల్లి సచివాలయంలో క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ అప్‌డేట్ క్యాంప్ జరుగుతుందని తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, మార్పులు చేర్పులు, వేలి ముద్రలు పడనివారు, చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు జారీ, ఐదేళ్లు పైబడిన పిల్లల ఆధార్ అప్‌డేట్, 15 ఏళ్లు నిండిన వారి వేలిముద్రల అప్‌డేట్ వంటి అన్ని రకాల ఆధార్ సేవలకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్ గురించి గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె:తీర ప్రాంతమైన రేపల్లె రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. స్టేషన్‌ను అమృత స్టేషన్‌గా అభివృద్ధి చేసే సమయంలో ప్రయాణీకుల సౌకర్యార్థం పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు తూర్పువైపు ఉన్న మెయిన్‌రోడ్డును స్టేషన్ నుంచి నిజాంపట్నం రోడ్డుకు కలిపి బస్సు, రైలు ప్రయాణికులకు రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగులు వీలుగా స్టేషన్ తూర్పు, పడమరల వైపు ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా విజయవాడ-తెనాలి ఎక్స్‌ప్రెస్‌ను రేపల్లె వరకు పొడిగించి, తిరిగి ట్రైన్ రేపల్లె నుంచి తెనాలి మీదగా విజయవాడకు నడిపాలన్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: మాస శివరాత్రి సందర్భంగా సోమవారం ఉదయం పెదనందిపాడు శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర శర్మ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన, పరివార దేవతార్చన, విశేష పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

671 మంది విద్యార్థుల హాజరు

చెరుకుపల్లి: గీతం, కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం జూనియర్ ఇంటర్ మాథ్స్-1, సివిక్స్, బోటని పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. గీతంలో 354మందికి గాను 342 మంది హాజరయ్యారు. కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 335 మంది విద్యార్థులకు గాను 329 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల ఎగ్జామ్ సూపరింటెండెంట్లు జి.రామచంద్రరావు, వై.దాసు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్ష పదవికి నరాలశెట్టి రాజీనామా

బాపట్ల: వైఎస్సార్ సీపీ బాపట్ల పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని నరాలశెట్టి ప్రకాశరరావు తెలిపారు. సోమవారం స్థానిక రథం బజారులోని వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, కార్యకర్తగా కొనసాగుతానని చెప్పారు. రాజీనామాను పార్టీ అధిష్టానానికి పంపుతానని నరాలశెట్టి చెప్పారు.

చుక్కల భూములకు పరిష్కారం హర్షణీయం

బాపట్ల: చుక్కల భూములపై రైతులకు హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, ఆయన తనయుడు మధుసూదనరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12 ఏళ్ల స్వానుభవ రెవెన్యూ రికార్డులు ఉంటే వారికి హక్కు కల్పించటం ఎంతో సంతోషమన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూ స్తున్న చుక్కల భూములకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు.

ఉమామహేశ్వర స్వామి గ్రామోత్సవం

నగరం: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరం పుర వీధుల్లో శ్రీగంగా అన్నపూర్ణ సమేత ఉమామహేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజా సామగ్రి అందించి, విశేష పూజలు చేశారు. తొలుత ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

అమర్తలూరు(వేమూరు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై నియోజకవర్గం స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గం ప్రత్యేకాధికారి బొంత అర్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్డీఏ పీడీ, ఇంజినీరింగ్ సూపరింటెండెంట్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, అధికారులు పాల్గొననున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేకాధికారులు, మండలాధికారులు, ఏఈలు హాజరు కావాలని చెప్పారు.

కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు



సన్మాన కార్యక్రమంలో కె.చంద్రశేఖర్ తదితరులు

బాపట్ల అర్బన్: బాపట్ల వీఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో డాక్టర్ కేవీఎన్డీ ప్రసాద్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలను దర్శకుడు కె.చంద్రశేఖర్ సోమవారం ప్రదానం చేశారు. నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి, సీనియర్ జర్నలిస్ట్ రావూరి నరసింహవర్మ, సంగీత దర్శకుడు కొండవీటి సాంబశివరావు, కవి, వక్త షేక్ ఆదంషఫీవుల్లా, బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్‌కు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా డీఎస్పీ గోలి లక్ష్మయ్య, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ఏ రామరాజు, యూనివర్సల్ హెల్పింగ్ హాండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బొలగాని బాలకృష్ణుడుఏ పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలను సన్మానించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. కొరప్రాటి సాయి దుర్గా హర్షిణి, మాతంగి ప్రశంస విజయరాజ్, భరత నాట్య కళాకారిణి మునిపల్లి భావన వెంకట సాయి సంప్రదాయ నృత్యాలతో ప్రేక్షకుల్ని మంత్రముగ్దుల్ని చేశారు. షిర్డీ సాయిబాబా దేవస్థానం ప్రధాన అర్చకుడు కర్లపాలెం మోహన రత్న సాయి, కథా ఫౌండేషన్ అధ్యక్షుడు సమ్మెట శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ పీర్, వెంకు సనాతని, తోట సాయికుమార్, కృష్ణకిషోర్, సాయి కిరణ్, శివ శంకర్, కృష్ణ, శ్రీహరి, పవన్ సాయి, సురేష్, భ్రమర, మౌనిక, రాజేశ్వరి పాల్గొన్నారు.

రికవరీ ఫోన్లు బాధితులకు అందజేత



సురేష్‌కు మొబైల్ అందజేస్తున్న ఎస్ఐ శివయ్య

కర్లపాలెం: సెల్ ఫోన్లు చోరీకి గురైన, పొరపాటున పోయినా కొనుగోలు బిల్లుతో తమకు ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. ఇటీవల కాలంలో మండల పరిధిలో పోగొట్టుకున్న ముగ్గురి సెల్‌ఫోన్లను రికవరీ చేసి సోమవారం పోలీస్ స్టేషన్‌లో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరలి గ్రామానికి చెందిన సురేష్, శ్రీనివాసరెడ్డి మోటుపాలెం గ్రామానికి చెందిన శివయ్య తమ ఫోన్లు పోయాయని ఇటీవల ఫిర్యాదు చేయటంతో ట్రేస్ చేసి, తిరిగివ్వడం జరిగిందన్నారు.

కోనేటిపురంలో పారిశుద్ధ్యం పరిశీలన



షెడ్‌ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు, అధికారులు

కోనేటిపురం(భట్టిప్రోలు): బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామం (ఓడీఎఫ్ ప్లస్)గా ఎంపికైన కోనేటిపురాన్ని స్వచ్ఛభారత్ మిషన్‌కి సంబంధించిన రీడ్స్ ఆర్గనైజేషన్ బృందం సోమవారం సందర్శించింది. ఈ దర్భంగా పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నివాస గృహాల్లోని మరుదొడ్లను బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే స్థానిక ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ)షెడ్‌ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది పని తీరు బాగుందని ఉందని కితాబిచ్చారు. గ్రామస్తులందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్గనైజేషన్ సభ్యులు కె. సాయిబాబు, ఎస్కే మస్తాన్ కోరారు. గ్రామంలో అమలవుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలను సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి అడిగోపుల చిన వెంకటేష్ బాబు వివరించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



అరవ సాంబశివ రావు (ఫైల్)

కొల్లూరు: అదృశ్యమైన వ్యక్తి.. కాలువలో మృతదేహంగా లభ్యమైన ఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గాజుల్లంకకు చెందిన అరవ సాంబశివరావు (55) కంపవాతం అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 11 తెల్లవారు జామున మూత్ర విసర్జనకు వెళ్లి వచ్చిన ఆయన ఉదయం చూసేటప్పటికీ కనిపించకుండా పోయాడు. అప్పట్నుంచి అతని కోసం బంధువులు పలు ప్రాంతాల్లో గాలించారు. 13న కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం కొల్లూరు లాక్ సెంటర్‌లోని పడవల కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమానంతో అదృశ్యమైన వ్యక్తి బంధువులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పరిశీలించి సాంబశివరావుగా గుర్తించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

నగరం: అకాల వర్షాలకు దెబ్బతిన్న దెబ్బతిన్న పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకుడు అక్తర్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న రబీ పంటలను సోమవారం ఏడీఏ పరిశీలించారు. రైతులకు తగిన సూచనలిచ్చారు. వేరుశనగ, అపరాలు, మొక్కజొన్న పంట పొలాల్లో వర్షపు నీటి నిల్వలను తొలగించాలన్నారు. వేరుశనగ, అపరాల పంటలకు అన్నబేధి లీటర్ నీటికి పది గ్రాములు, నిమ్మ ఉప్పు లీటర్ నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేష్‌బాబు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన ఆటో

జంపని(వేమూరు): జంపని డ్రైనేజీ కాలువ వంతె వద్ద ఆటో బోల్తాపడి డ్రైవరు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ వేమూరులో మద్యం సేవించి.. జంపనికి వెళ్తుండగా.. డ్రెయినేజీ వంతెన వద్ద అదుపు తప్పి పక్కన ఉన్న గుంతలో ఆటో బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఎస్ఐ బోడయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.